క్లుప్తంగా

నేడు మంత్రి అప్పలరాజు ఇచ్ఛాపురం రాక

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండలంలో వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం మధ్యాహ్నం వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ ఆదివారం తెలిపారు. బారువ, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, ఇచ్ఛాపురం మండలం పరిధిలోని మండపల్లి గ్రామంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభిస్తారన్నారు.

'మా బూత్ సిద్ధం' కిట్ల పంపిణీ



కీర్తిపురంలో సిద్ధం కిట్లు అందజేస్తున్న నారాయణమ్మ

ఇచ్ఛాపురం రూరల్: రాబోయే ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసేందుకు 'మా బూత్ సిద్ధం' అంటూ ప్రతీ ఒక్క గృహసారథి, జేసీఎస్ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు సిద్ధంగా ఉండాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ పిలుపునిచ్చారు. కొళిగాం, కీర్తిపురం, పాయితారి పంచాయతీల్లో ఆదివారం పర్యటించి బూత్ కన్వీనర్లకు 'సిద్ధం'కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో బూత్ కన్వీనర్లు పార్టీ ఆదేశాల ప్రకారం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, లోపింటి దీనబందురెడ్డి, శ్రీనివాసరావురెడ్డి, ఉప్పాడ రాజారెడ్డి, గండో మహాపాత్రో ఉన్నారు.

అమ్మవారికి చల్లదనం పూజలు



అమ్మవారి సంబరాల్లో ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారికి చల్లదనం పూజలు ఆదివారం జరిగాయి. బెల్లుపడ గ్రామం 12, 13 వార్డుల్లో అమ్మవారికి చల్లదనం చేసేందుకు ప్రత్యేక సంబరాన్ని చేశారు. ఇందులో అమ్మవారి రూపానికి ప్రతీకగా గజముద్దను సిద్ధం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, వార్డు కౌన్సిలరు బుడ్డెపు ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిలక సంతోష్, దువ్వు వివేకానంద, బుడ్డెపు త్రినాథ్, పిలక యాదవరెడ్డి, ఇప్పిలి కృష్ణారావు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు జీడి పిక్కల మద్దతు ధర కోసం ధర్నా

పలాస: కాశీబుగ్గ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సోమవారం ఉదయం జీడి పిక్కల మద్దతు ధర కోసం ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏపీ జీడి రైతాంగం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్దానం ప్రాంత జీడి రైతులంతా హాజరు కావాలని కోరారు.

నేడు పీహెచ్‌సీ భవనం ప్రారంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీ భవనం

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బంది పడేవారు. ఇలాంటి పరిస్థితిలో వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌సీకి కొత్త భవనాలను సమకూర్చింది. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కృషితో నాడు-నేడు పథకంలో భాగంగా రూ.1.85 కోట్లు నిధులు వెచ్చి నూతనంగా అన్ని సదుపాయాలతో కొత్త భవనాలను నిర్మించారు. వీటిని సోమవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రారంభిస్తారని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉదయ్‌కుమార్, సర్పంచ్ లండ లోలాక్షి, పార్టీ సీనియర్ నాయకులు లండ రామలింగం తెలిపారు. కాగా ఆస్పత్రి అందుబాటులోకి వస్తుండడంతో ఈ ప్రాంతీయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎల్లమ జాతర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిమ్మన దాస్

సోంపేట: సోంపేట పట్టణంలోని జామి ఎల్లమ్మ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ నిమ్మన దాస్ కోరారు. ఎల్లమ్మ కోవెలలో ఎల్లమ్మను మాలధారణ స్వాములతో కలిసి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన

● మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



సువర్ణాపురంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

మందస: సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసిందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పర్యటించి అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలించిన ఐదేళ్లలో కోవిడ్ సంక్షోభం రెండేళ్లు వేధించగా.. మూడేళ్లు సక్రమంగా పని చేయడానికి అవకాశం లభించిందన్నారు. ఈ పరిస్థితుల్లో ఏ క్షణాన్ని కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృథా చేయలేదన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేశామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ, అభివృద్ధిని కూడా చేశామన్నారు. ఈ ప్రాంతాన్ని గౌతు కుటుంబం నిర్లక్ష్యం చేసిందన్నారు. కేవలం పెట్రోల్ బంక్ కాపాడుకోవడం కోసమే బిన్నళను దత్తత తీసుకున్నట్టు గౌతు కుటుంబం నటించిందన్నారు. 52 ఏళ్లుగా రహదారి లేని ఈ ప్రాంతానికి రూ.కోటికి పైగా నిధులతో చక్కని రహదారి వేశామన్నారు. గౌతు కుటుంబీకులు ఈ రహదారిపై ప్రయాణించడానికి సిగ్గుపడాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు సంక్షేమ పథకాలు అందించామని, వారంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలన్నారు. ప్రజలు అవకాశమిస్తే.. ఈ పథకాలు కొనసాగుతాయని, టీడీపీని గెలిపిస్తే పథకాలు రద్దు అవుతాయన్నారు. ప్రతీ ఇంటికీ కనీసం లక్ష రూపాయలను ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందన్నారు. ముందుగా సువర్ణాపురంలో సచివాలయం, హరిపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు, అభివృద్ధి పనులు, బిన్నళమదనాపురంలో తారురోడ్డు, అభివృద్ధి పనులు, కొత్తపల్లిలో సచివాలయం, అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, సర్పంచ్ సేనాపతి దివ్య, జగన్నాథపురం పురుషోత్తం, ఎంపీటీసీ సభ్యులు మార్పు భవాని, గొరకల పార్వతి, ఆనల అప్పన్న, కర్రి తిరుమల, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, జిల్లా కార్యదర్శి దల్లి జానకీరావురెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శి బల్ల లీలాకుమారి, సవర ఢిల్లేశ్వరి, కర్రి గోపాలకృష్ణ, గుసిరి వెంకటరావు, యవ్వారి నాగేశ్వరరావు, దుంపల వైకుంఠరావు, యవ్వారి నాగేశ్వరరావు, పైల నారాయణరావు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి. చిత్రంలో పేరాడ తిలక్, దువ్వాడ శ్రీనివాస్ తదితరులు

● బూత్ కన్వీనర్లతో సమావేశంలో వెంకటరెడ్డి, తిలక్, శ్రీనివాస్

టెక్కలి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా బూత్ కన్వీనర్లంతా సైనికుల్లా పనిచేయాలని పార్టీ టెక్కలి నియోజకవర్గ పరిశీలకుడు కాయల వెంకటరెడ్డి కోరారు. ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ అధ్యక్షతన శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ముఖ్య అతిథిగా ఆదివారం టెక్కలిలో బూత్ స్థాయి కన్వీనర్లతో ఎన్నికలపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. బూత్ స్థాయిలో కన్వీనర్లు కీలకంగా పనిచేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ ఎన్నికల్లో కష్టపడితే, రానున్న ఐదేళ్లు స్వర్ణయుగం మన సొంతం అవుతోందన్నారు. వైనాట్ 175లో భాగంగా టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయం కీలకమని చెప్పారు. పేరాడ తిలక్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బూత్ స్థాయిలో పనిచేసిన కార్యకర్తలంతా మరోసారి స్థానిక అంశాలను పరిశీలన చేసుకోవాలన్నారు. పార్టీ, కార్యకర్తల కోసం ఏ సమయంలో.. ఏ అవసరమైనా సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. అంతా సమిష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీ విజయానికి వారథులుగా నిలవాలని కోరారు. దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. బూత్ స్థాయి కన్వీనర్లకు దిశా నిర్దేశం చేయడానికి తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. గత ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ టెక్కలి నియోజకవర్గంలో అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ కోట్ల రూపాయలు కేటాయించారని గుర్తు చేశారు. ఈ నియోజకవర్గంపై సీఎం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టడానికి తమతో పాటు కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12వ తేదీన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ వాటిని పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత, సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పి.వసంతరెడ్డి, టెక్కలి, కోటబొమ్మాళి మండలాల పార్టీ కన్వీనర్లు బి.హరి, ఎస్.సత్యరాజ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, వైస్ ఎంపీపీలు పి.రమేష్, ఎం.కిశోర్, జేసీఎస్ ఇన్‌చార్జి మోహన్, నాయకులు చింతాడ గణపతి, రోణంకి మల్లయ్య, కె.అజయ్, పి.హేమలత, చిన్ని జోగారావు, ఆకుల వెంకటేశ్వరరావు, పి.వైకుంఠరావు, ఎస్.శంకర్, బి.తులసీరావు, వి.శ్రీధర్‌రెడ్డి, బి.రామకృష్ణ, కె.గాంధీ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

● ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



శ్రీజగన్నాథపురంలో సచివాలయ భవనాన్ని పారంభిస్తున్న దువ్వాడ శ్రీనివాస్

కోటబొమ్మాళి: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. శ్రీజగన్నాథపురం, కురుడు, ఎత్తురాళ్లపాడు, దంత పంచాయతీల్లో నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో పంచాయతీలో సుమారు రూ. కోటితో భవనాలను ప్రభుత్వం నిర్మించిందన్నారు. గ్రామస్థాయికి పరిపాలన తీసుకురావలన్న ఉద్దేశంతోపాటు పేదలకు మేలు జరగాలన్న తపనతో ముఖ్యమంత్రి జగన్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. అనంతరం శ్రీజగన్నాథపురంలో మాజీ ఎంపీ స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నూక సత్తిరాజు, కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, సర్పంచ్‌లు గురివెల్లి కేశవరావు, కోత చిన్నారావు, గొండు చాందిని, బి.ఎల్లయ్య, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, నాయకులు సుంకరి జనార్దన, బమ్మిడి శ్రీనివాస్, ఎస్.వినోద్, పూజారి సత్యం, బగాది దివాకర్, పొన్నాన మోహనరావు, రొక్కం సత్యన్నారాయణ, నేతింటి సంహాచలం, మెట్ట సింహాచలం, తంగి భార్గవ ఉన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

సోంపేట: సోంపేటలోని బీసీ వసతి గృహంలోని పదో తరగతి విద్యార్థినులకు సత్యసాయి యువజన విభాగం ఆధ్వర్యంలో పరీక్షలకు అవసరమైన సామగ్రిని ఆదివారం అందజేశారు. సభ్యులు ఈపరి రవి, వి.రాంప్రసాద్, తిరుమల, తంగుడు శ్రీను ఉన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలి



కృపారాణికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతమయ్యే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని జిల్లా అసోసియేషన్ సభ్యులంతా కోరారు. ఈ మేరకు కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణిని ఆదివారం టెక్కలిలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేసే ప్రక్రియలో భాగంగా తమను కూడా రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపే విధంగా చూడాలని విన్నవించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని కృపారాణి పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

● జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, సాయిరాజ్

కవిటి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా విజయ అన్నారు. మండలంలోని గొండ్యాలపుట్టుగలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలతో పోలిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ సర్కార్ హయాంలో అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందించామని చెప్పారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. గ్రామానికి వచ్చి కల్లబొల్లి మాటలు చెబుతున్న ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే అశోక్ ఈ గ్రామానికి ఏం ఒరగబెట్టారో చెప్పాలన్నారు. గ్రామస్తులు ఎవ్వరికీ బయపడాల్సిన అవసరం లేదని.. తామంతా అన్నివేళల్లో భరోసాగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా రూ. పది లక్షల జెడ్పీ, జీజీఎంపీ నిధులతో శ్రీశైన సంఘం సామాజిక భవనం నిర్మాణానికి, రూ. 5 లక్షల జెడ్పీ నిధులతో మహిళా సామజిక భవనం నిర్మాణానికి, రూ. 4 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, మండల పార్టీ కన్వీనర్ కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, జేసీఎస్ కన్వీనర్ జల్లు యుగంధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ వై.నీలయ్య, ఎంపీటీసీ సభ్యులు పూడి నీలాచలం, అలిగి హేమలత, ధర్మారావు, శంకర్ ప్రాధాన్ మానెక, పి.శేఖర్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు

● కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి

వజ్రపుకొత్తూరు రూరల్: క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు పడడంతోపాటు గ్రామాల్లో శాంతి వాతావరణానికి దోహదం చేస్తాయని కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ జి.రాధిక ఆదేశాల మేరకు నగరంపల్లిలో స్థానిక ఎస్సై సీహెచ్ రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఎస్పీ కప్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు, ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు నెలకొల్పేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా క్రీడలు, ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. క్రీడలతో గ్రామీణ ప్రాంతాల్లో యువకుల మధ్య సోదరభావం మెరుగుపడుతుందన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి క్రీడలు చక్కటి మార్గం అని అన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై అసక్తి చూపాలన్నారు. అనంతరం క్రికెట్, వాలీబాల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి.. ప్రాణభిక్ష పెట్టి..



రక్తదానం చేస్తున్న విశ్వనాథం

కాశీబుగ్గ: బిడ్డ సంచి సమస్యతో బాధపడుతున్న మహిళలకు 'ఓ' పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయం తెలుసుకున్న ఓ యువకుడు రక్తదానం చేసి ఆమెకు ప్రాణభిక్ష పెట్టారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పాతజాతీయ రహదారిలో ఉన్నటువంటి సాయిరాజ్ ఆస్పత్రికి ఓ మహిళకు రక్తం తగ్గిపోవడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. విషయం తెలిసిన వెంటనే వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురం గ్రామానికి చెందిన గొరకల విశ్వనాథం ఆదివారం ఆస్పత్రికి చేరుకొని రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



చెక్కులను అందజేస్తున్న శ్రీనివాస్

కోటబొమ్మాళి: ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సంబంధిత వ్యక్తులకు ఆదివారం పంపిణీ చేశారు. పెద్దహరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన భగాది భానుప్రసాద్‌కు రూ. 60 వేలు, ఎత్తురాళ్లపాడుకు చెందిన మామిడి సూర్యనారాయణకు రూ. 80 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గురివెల్లి కేశవరావు, ఎంపీటీసీ సభ్యులు బగాది దివాకర్, పూజారి సత్యం, ఫీల్డుఅసిస్టెంటు సోమేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ మెట్ట శాంతారావు ఉన్నారు.

వలంటీర్‌పై దుష్ప్రచారం!



కుళాయిని కత్తితో విరగ్గొడుతున్న ఎండమ్మ (ఫైల్)

నందిగాం: పెద్దలవునిపల్లి పంచాయతీ చిన్న లవునిపల్లి వలంటీర్ కవిటి రవికుమార్ వృద్ధ దంపతులపై దాడి చేశారంటూ టీడీపీ కార్యకర్తలు, అనుకూల పత్రికలు చేస్తున్న ప్రచారం అవాస్తవం. గతంలో ఎప్పుడు లేని విధంగా ప్రస్తుత సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయిలు వేసి మంచి నీరు అందిస్తున్నారు. రోజూ నీటి కోసం మోటార్ వేయడానికి గ్రామానికి చెందిన పాలవలస జోగారావును నియమించారు. అయితే ఇటీవల గ్రామానికి చెందిన దట్టి ఎండమ్మ, కురమయ్య దంపతులు తమ ఇంటి ముందు కుళాయికి నీరు రావడం లేదని కత్తి పట్టుకొని దాన్ని విరగ్గొట్టేశారు. దీనిపై ప్రశ్నించిన జోగారావును నానా దుర్భాషలాడటంతో స్థానిక వలంటీర్ రవికుమార్‌కు విషయం తెలియజేశాడు. దీంతో వలంటర్ పంచాయతీ కార్యదర్శి స్వాతికి విషయం తెలియజేయడంతో ఇద్దరు కలిసి ఎండమ్మ ఇంటి వద్దకు మాట్లాడేందుకు వెళ్లారు. అయితే వారిపై కూడా నానా దుర్భాషలు ఆడుతూ తన ఇంటిపై ఉన్న రేకులను తనే స్వయంగా తొలగించుకొని వలంటర్ తమపై దాడి చేశారని, ఇంటి రేకులు తొలగించారని అవాస్తవాలు చెప్పారు. గ్రామంలో అధికశాతం వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండటం, స్థానం సంపాదించుకోవాలని ఆరాటపడుతున్న స్థానిక తెలుగుదేశం కార్యకర్తలు దీన్ని అదునుగా తీసుకొని ఎండమ్మకు మరింత రెచ్చగొట్టి, తమకు అనుకూల పత్రికలకు, మీడియాకు పిలిచి నానా హంగామా చేశారు. ప్రభుత్వం వేసిన కుళాయిని విరగగొట్టడమే కాకుండా పంచాయతీ కార్యదర్శి, వలంటర్‌కు దుర్భాషలాడిన ఎండమ్మ గతంలో కూడా గ్రామంలో పలువురుతో పాటు తమ కుమారులపై కేసులు పెట్టిన సందర్భాలు ఉన్నాయి.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం రేపు

కాశీబుగ్గ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా పండుగను ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం ఓ ప్రకటన విడుదల అయ్యింది. ఆ రోజు ఉదయం పది గంటలకు పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద జెండా పండుగతో పాటు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ నుంచి చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మూడు మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ వివిధ కేటగిరీలకు చెందిన ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

గోపినాథపురంలో రక్తదాన శిబిరం

వజ్రపుకొత్తూరు: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు రక్తం అందించి వారి ప్రాణాలు కాపాడడానికి రక్తదానం చేయాలని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు కోరారు. ఉద్దాన గోపినాథపురంలో పలాసకు చెందిన ప్రాణదాత బ్లడ్‌బ్యాంక్ నిర్వహించిన రక్తదాన శిబిరానికి పలువురు యువకులు వచ్చి రక్తదానం చేశారు. హెల్పింగ్ సొసైటీ సభ్యులు సంతోష్, హారిక, కమల. సావిత్రి, హేమారావు ఉన్నారు.

నియోజకవర్గ చేయూత కార్యక్రమం రేపు

కాశీబుగ్గ: కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఈ నెల 12న నియోజకవర్గస్థాయి చేయూత కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు క్యాంప్ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల అయ్యింది. మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే సమావేశంలో మూడు మండలాలు, మున్సిపాలిటీకి సంబంధించిన 21 వేల మంది లబ్ధిదారులకు చేయూత నగదు ప్రోసీడింగ్ పత్రాలను పంపిణీ చేయనున్నారు.

● విజయ తిలకం



కవిటి మండలంలోని గొండ్యాలపుట్టుగలో వివిధ అభివృద్ధి పనులకు జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమెను స్థానిక మహిళలు ఆశీర్వదిస్తూ విజయ తిలకం దిద్దారు. – కవిటి